

# బ్రతుక నేర్చిన వాడు

ఎర్రంశెట్టిసాయి

షేరిన్ కార్నర్‌లో రెడిమేడ్ బట్టల షాపులో చిన్న కొడుక్కి చొక్కా, నిక్కరు కొని బయటికి వచ్చాడు రమాపతి.

రమాపతి బయటికి వచ్చిన మరు క్షణంలోనే ప్రక్కనే వున్న లాండ్రీలో క్లాక్ తీసుకుని బయటికి వచ్చాడతను. రమాపతిని చూశాడు.

ముందుకు కదలబోతోన్న రమాపతి వెనకనే నాలుగడుగులు వేశాడతను. మరికాస్త దూరంవెళ్ళి "రామకృష్ణా"లో దూరబోతోన్న రమాపతిని "సార్" అని పిలిచాడతను.

దగ్గర్లో పిలవటంతో తననే పిలుస్తున్నట్లుగ భావించుకుని తిరిగి చూశాడు రమాపతి అదే క్షణంలో నమస్కారం చేసి "నన్ను గుర్తించలేదా మేస్టారూ!" అన్నాడతను.

ఒక్క క్షణంపాటు తికమకపడి ఏం జవాబు చెప్పాలా అని ఆలోచించాడు రమాపతి.

"నేను సార్ మీ స్టూడెంట్‌ని"

స్పష్టంగా ఆతన్ని గుర్తించలేక పోయినా ముఖమాటానికి ఏదో గుర్తు కొచ్చినట్లుగ "ఓ !" అన్నాడు రమాపతి

ఆ మాటల కతను నవ్వి "క్షమించండి సార్ ! ఇలా అంటున్నందుకు మీరు నన్ను గుర్తించలేదు సరిగదా మీ వూహల దరిదాపుల్లో కూడా నేను లేను" అన్నాడు.

కొంచెం సిగ్గుతో "నిజమే ! గుర్తించలేదు" అన్నాడు రమాపతి యింకేం అనలేక.

"పదండి కాఫీ తాగుదాం" అని హోటల్‌కి దారితీశాడతను. ఎలాగూ తనూ వెడుతున్నాడు కాబట్టి అతన్ని అనుసరించాడు.

వెళ్ళి కూర్చుని సర్వర్ రాగానే "రెండు ప్లేట్స్ యిడ్లీ, వడ సాంబార్ - చెట్నీ" పట్రా అన్నాడు.

రమాపతి ముఖంలోకి చూసి "ఈ రోజంతా మీరు ఆలోచించినా నేను గుర్తుకి రానులెండి సార్ ; అబ్బో ! ఎప్పటి మాట ? దాదాపు పదేళ్ళయిందేమో !" అన్నాడతను నవ్వుతూ.

నవ్వలేక నవ్వాడు రమాపతి

ఇంతలో టిఫిన్ తెచ్చాడు సర్వర్. "రెండు పొంగల్ పట్రా" అని తెచ్చిన వాటిపై దాడికి వుపక్రమిస్తూ "కానివ్వండి సార్" అన్నాడతను.

రమాపతి ఆలోచనలతో తిననారంభించాడు.

టిఫిన్ ముగించి "రెండు కాఫీ" అని "సార్ ! యీ పొంగల్ లాగా మన దేశంలో మరో టిఫిన్ లేదండి" అన్నాడు మెచ్చుకోలుగా.

కాఫీ వచ్చింది అంతలో. బిల్లూ, కాఫీ గ్లాసూ అందుకున్నాడతను రమాపతి చెయ్యి బిల్లుపైకి పోకముందే. బిల్ పే చేసి బయటికి వచ్చి "సార్ ! నేను యిక్కడే విజయా మాన్షన్స్‌లో దిగాను. వెళదాం రండి" అన్నాడు ముందుకు దారి తీస్తూ. సందిగ్ధంగా చూసిన రమాపతితో "గదికి రండి. నా చహరా చెపుతాను" అన్నాడతను మళ్ళీ.

మౌనంగా అనుసరించాడు రమాపతి.

గదికి వెళ్ళి కూర్చున్నాక "నన్ను నిజంగా గుర్తించలేదా మేస్టారూ ?" అడిగాడు మళ్ళీ.

ఆ మాటకి "ఎంత ఆలోచించినా మన పరిచయం ఎక్కడో గుర్తుకు రావటం లేదు" అన్నాడదో విధంగా.

పకపక నవ్వి "నేను చెప్పాను కదా సార్ ! మీరు గుర్తించలేరని చెపుతా వినండి. మీరు తిరుపతిలో ఎమెస్సీ చేసేప్పుడు మీరు అద్దెకున్న యింటి అబ్బాయి గుర్తున్నాడా ?" అని అడిగాడు.

"ప్రకాశానివి కాదే నువ్వు" అన్నాడు రమాపతి.

"కాదు మేస్టారూ ! ప్రకాశం వెంట వచ్చే చందూని."

"చందూ ... చందూ ... అంటే చంద్రశేఖరానివా ?"

"అబ్బ ! యిప్పటికి గుర్తుకొచ్చా నన్నమాట - ధన్యుణ్ణి."

అవును మాస్టారూ నేను చంద్రాన్నే- చంద్రశేఖరాన్నే - నేను ఎమ్మే లిట రేచర్ పూర్తిచేశాను. ఇక్కడ యాక్టింగ్ స్కూల్లో ఏదో శిక్షణ యిస్తున్నారంటే చేరాలని వచ్చాను. లాండ్రీకి వెళ్ళి తిరిగి వస్తూంటే మీరు కనిపించారు. మీరేం చేస్తున్నారు మేస్టారూ ?"

"నేను యిక్కడ రైల్వేలో పని చేస్తున్నానయ్యా. మరి ప్రకాశం ఏం చేస్తున్నడోయ్ ?"

"ప్రకాశం కూడా ఎమ్మే పూర్తిచేసి కర్నూల్లో పనిచేస్తున్నాడు మాస్టారూ ! వాడికి ఐ. ఏ ఎస్ చెయ్యాలని పుఖ లాటం వుండింది. కానీ రెండుసార్లు వెళ్ళినా లాభం లేకపోయింది చివరకి విసిగిపోయి బి. ఎడ్ చేసి టీచర్‌గా వర్క్ చేస్తున్నాడు. అక్కడే ఉస్మానియా కాలేజీలో ఏదో పోస్ట్ ఖాళీ అవబో తోందని లెక్చరర్‌గా చేరగలనని రాశాడు మొన్ననే."

"నీవేం వుద్యోగం చెయ్యటం లేదా మరి ?"

"లేకేం మాస్టారూ ! హైదరాబాద్‌లో సెక్రెటేరియేట్‌లో వర్క్ చేస్తున్నాను."

"మరి ఉద్యోగానికి ... యీ ట్రెయినింగ్‌కి..."

"అంతె కుదరదు మాస్టారూ ! అందుకే లీవ్ అప్లయి చేస్తాను. ఫిల్మిండస్ట్రీలో కాలూనాలే కాని మిగతా జీవితాలు జీతాలు దీనిముందు దిగదుడుపే కదా ! యాక్టరుగనో డైరక్టరుగనో స్థిరపడిపోవాలనుకుంటున్నాను."

"గుడ్ ... మంచి ఆలోచనే ..." అని లేచి "మరి వస్తాను మిస్టర్ చంద్రం ... వీలయినపుడల్లా కలుస్తూ వుండు." అన్నాడు రమాపతి.

గడియారం చూసుకుని "ఎనిమిది కావస్తూంది. భోజనం చేసి వెళుదురు గాని" అన్నాడు చంద్రం.

ఆ మాటకి నవ్వి "ఇక్కడికి వచ్చిన వాడికి నీకు నేను ఆతిథ్యం యివ్వాలి నీవు నన్ను సత్కరించటం ఏమిటోయ్" అన్నాడు రమాపతి,

"అలా కాదండి మేస్టారూ ! జీవితంలో స్థిరపడ్డవాళ్ళు మీరు. మేము యింకా పైలా పచ్చీసూగా తిరుగుతున్న వాళ్ళం మీరు మాకు గురువుగారు. ఆ నాడు మీరు శ్రద్ధతీసుకుని వుండక పోతే ప్రకాశం అంతవాడు అయ్యేవాడు కాదు, నేనూ మీ దయవల్ల యింతవాడిని అయ్యాను. పదండి భోజనం చేద్దాం. ఆ మిషతో మరోగంట కులాసాగా

గడుపుదాం" అన్నాడు చంద్రం బల వంతం చేస్తూ.

"అబ్బే! నన్ను ముఖమాటం పెట్టొద్దోయ్. ఇంటివద్ద నా భార్యా పిల్లలు ఎదురు చూస్తూంటారు."

"ఎంత మాస్టారూ? మీరు యింటికి వెళ్ళే గంటలో భోజనం ముగించవచ్చు. ఎంత లేదన్నా తొమ్మిదికి అటూ యిటుగా యిల్లు చేరుకోవచ్చు" అని బయటికి వచ్చి రూం లాక్ చేశాడు.

మెట్లుదిగుతూ "ఇక్కడేనా భోజనం" అన్నాడు రమాపతి.

అతనివేపు అదోలా చూసి "లేదు మాస్టారూ! స్వప్నకి వెడదాం" అన్నాడు చందూ. స్వప్నలో భోజనం చేసినంతసేపూ కుసాలాగా కబుర్లు చెప్పాడు చంద్రం ప్రకాశంకి పెళ్ళయిందనీ ముగ్గురు పిల్లలనీ కుటుంబ నియంత్రణ అమలుపరిచాడనీ తనకీ పెళ్ళయిందనీ యింకా సంతానం లేదని చెప్పాడు చందూ. మాటల్లో రమాపతికి నలుగురు కూతుళ్ళు,యిద్దరు కొడుకులనీ తర్వాత అతనే వేసక్టమీ చేయించుకున్నాడనీ చెప్పాడు.

భోజనంచేసి టాక్సీలో ఎక్కి రమాపతిని యింటివద్ద డ్రాప్ చేసి రమ్మంటున్నా మళ్ళీ వస్తానని యింట్లోకి వెళ్ళకుండా వెళ్ళిపోయాడు చందూ.

* * *

తర్వాత నెలరోజులవరకూ రమాపతికి అతని దర్శనం కాలేదు. లాడ్జిలో విచారిస్తే అతను ఖాళీచేసి వెళ్ళాడని తెలిసింది.

ఓ రోజు సాయంకాలం హిగిన్ బాదమ్స్‌లో ఏవో పుస్తకాలు చూస్తూన్న రమాపతికి "నమస్తే! సార్" అన్న పిలుపు వినబడింది.

తిరిగి చూస్తే చంద్రశేఖర్.

రమాపతి ముఖం వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగింది.


"అదేమిటోయ్! ఆ రోజు అంత అకస్మాత్తుగా వెళ్ళిపోయావ్?" అన్నాడు రమాపతి నిష్ఠూరంగా.

"సారీ సార్? నేను వెళ్ళిపోలేదు. ఓ ఫ్రెండ్ వస్తే అతనింట్లో మకాం వేశాను. అతను సి. ఐ టి నగర్‌లో వున్నాడు. నేను అక్కడే వున్నాను."

"ఆఁ పోనీలే! ఏదో మన వాడివి. మళ్ళీ మళ్ళీ కలుస్తూ వుంటేనే బావుంటుందని అడిగాను అంతే!" అన్నాడు రమాపతి.

మరో పదినిముషాల్లో సెంట్రల్ నించి బయటికి వచ్చి టాక్సీని కేకేసి "రండి సార్ వెడదాం" అని రమాపతి వచ్చి కూర్చున్నాక "హోటల్ అశోక" అని యాజీగా టాక్సీలో చేరగిలబడి "ఇప్పుడు చెప్పండి సార్; ఇంకేం కబుర్లున్నాయో" అన్నాడు చందూ.

అతని ఠీవి ముందూ, వితరణ ముందూ, ముఖ్యంగా అతను ఖర్చు




చేస్తున్న తీరుని గమనిస్తూ యిన్‌ఫీరియారిటీ ఫీలవసాగాడు రమాపతి.

హోటల్ గదిలో కూర్చున్నాక స్వర్గంలో వున్నట్టుంది రమాపతికి. అతనికి అలాంటి హోటళ్ళలో డిగే అవకాశంకానీ అవసరంగానీ రాలేదింతవరకూ.

స్ట్రాంగ్ కాఫీ తెప్పించి "నాకీ మధ్య రేసుల్లో పది వేలొచ్చాయి సార్ ! ఫిల్మ్ యాక్టింగ్‌లో కూడా సీటు వచ్చింది" అన్నాడు చందూ నవ్వుతూ.

"కంగ్రాజులేషన్స్" అన్నాడు యింకేం అనలేక.

ఆ మాట యీ మాట అయ్యాక "మేము కొంతమందిమి కలిసి ఓ పిక్చర్ తియ్యాలనుకుంటున్నాం సార్ ! అంతా షేర్ బిజినెస్'' అని "అన్నట్టు మీరూ మాతో షేర్ తీసుకోరాదా ?" అన్నాడు గబాలున చందూ.

ఇబ్బందిగా ముఖంపెట్టి "షేరంటే కనీసం వెయ్యిరూపాయలైనా ఉంటుంది. నా జీతంతో కుటుంబం నడవటమే కష్టం. ఇంకా సినిమాలు తీయటమా ?" అని క్షణమాగి "నిజం చెప్పాలంటే నెలాఖరు మూన్నాళ్ళుంది. అమ్మాయికి ఏదో ఫీజు కట్టాలంటే వంద దొరక లేదు." అన్నాడు బలహీనంగా నవ్వుతూ.

వెంటనే పర్స్ తెరిచి బొత్తిగా వున్న కట్టలోంచి ఇరవై రూపాయి నోట్లు పది తీసి "ఇది వుంచండి సార్" అన్నాడు చందూ.

ఆ మాటలకి క్రుంగిపోయి "నో ! నో ! నిన్ను అడగాలని నా వుద్దేశ్యం కాదు. ఏదో మాటవరసకి అలా అన్నాను, అవసరం లేదులే ! రేపు ఎలాగో సర్దుబాటు చేసుకుంటాను" అన్నాడు రమాపతి గిల్టీగా ఫీ.యి

ఆ నోట్లు ఆతని చేతుల్లో కుక్కుతూ "నన్ను దూరం చేసి మాటాడకండి. మీరు నా అప్పులు మీ కిది యిబ్బందిలో యివ్వటం కాదు. సహాయం చేయటం కాదు. జస్ట్ ..." అన్నాడు చందూ.

అవి తీసుకుని "ఫస్ట్‌కి తప్పక యిచ్చేస్తాను" అన్నాడతను.

"ఆ మాట మరిచిపొండి. మీ తీరికలో యిద్దురు గని" అన్నాడు జాలీగా చందూ.

కృతజ్ఞత నిండిన మనస్సుతో వెళ్లాడు రమాపతి.

* * *

దాదాపు ప్రతిరోజూ కలుస్తూ వున్నారు చంద్రా రమాపతి. సినిమా కబుర్లు, చిల్లర కబుర్లు రాజకీయాలు మాటాడుకునేవారు యిద్దరూ — సామాన్యంగా ప్రతి రాత్రి రమాపతి చంద్రశేఖరంతో కలసి అతని ఖర్చుమీదే భోజనం చేసేవాడు.

ఆ రోజు రాత్రి దాశ్‌ప్రకాశ్‌లో భోంచేసి బయిటికి వచ్చాక టాక్సీ ఎక్కుతూ "ఇదిగో నోయ్! నీ రెండు వందలు" అని అందించబోయాడు రమాపతి.

చందూ అది అందుకోకుండా "సార్! మన మధ్య ఫ్రెండ్‌షిప్ పెరగాలంటే ఆ డబ్బు మీరు వుంచుకోవాలి" అన్నాడు.

"అదేమిటి?"

"అదంతే! అది గురుదక్షిణ అనుకోండి"

"యూ! సిల్లీ తీసుకో" అని యివ్వబోయాడతను.

"సారీ మాస్టారూ! ఇచ్చింది తీసుకోవటం మన జాతకంలో లేదు. కావాలంటే ఆ డబ్బుతో మేడమ్‌గారికి మాంచి పట్టుచీర కొనండి శిష్యుడిచ్చిన గురుదక్షిణ - అని చెప్పండి."

ఆ మాటతో "అలా అన్నావు. బావుంది కానీ, ఇన్నేళ్ళుగా కలిసి తిరుగుతున్నావు. మా యింటికో సారయినా వచ్చావూ? ఎప్పుడు పిలిచినా ఏదో సాకు చెపుతావు" అన్నాడు రమాపతి నిష్ఠూరంగా.

ఆ మాటకి నవ్వి "ఈసారి పిలవండి. తప్పకుండా వస్తాను" అన్నాడు చందూ.

తర్వాత ఓ క్షణం ఆలోచించి "అయితే యీ డబ్బు యిలా తీసుకోవన్న మాటే కదూ! సరే! నీ యిష్టం. నేనో మాట చెపుతా విను. నాకు యీ రోజు ఎరియర్స్ వచ్చాయి. దాదాపు జీతంతో కలిసి పదహారు వందలు వచ్చాయి. ఈ నెల ఖర్చు పోను వెయ్యి మిగులుతాయి. ఇది షేరుగా తీసుకో, అవకాశం యిస్తే రెండు యిన్‌స్టాల్‌మెంట్స్‌గా ఇంకొక షేర్ నా భార్య పేరిట తీసుకుంటాను" అన్నాడు రమాపతి.

ఆ మాటకి సంతోషంగా "అలాగే రెండుసార్లుగా కాకపోతే నాలుగు సార్లుగా యివ్వండి, మీకేం ?" అన్నాడు చందూ.

"అయితే యీ పన్నెండువందలా యాభయ్ తీసుకో, మిగతా విడతలుగా యిస్తాను."

ఆ డబ్బు అందుకుని "లాడ్జికి వెళదాం పదండి. షేర్స్ తీసుకున్నట్టు సంతకాలు చేద్దురు గానీ" అన్నాడు చందూ.

"నో ! నో ! అంత తొందరేం వచ్చింది. రేపు వచ్చినప్పుడు చేస్తాను. అన్నట్టు రేపు మా యింట్లోనే భోజనం, ఇహ యీ మాటు కాదనకు" అన్నాడు రమాపతి.

దానికి చిరునవ్వు నవ్వి "అలాగే" అన్నాడు చందూ.

సంతోషంగా విడిపోయారిద్దరూ బై-బై-లతో.

* * *

మరురోజు ఆఫీసుకు వెళ్ళేసరికి అపరిచితమైన వ్రాతతో వచ్చిన కవరు చూసి "ఎవరు రాశారా ?" అన్న సందిగ్ధతో చించి చదివాడు రమాపతి.

ఒక్కో అక్షరం చదువుతోవుంటే అతని ముఖంలో రంగులు మారసాగాయ్. ఉత్తరం పూర్తిచేసి నిర్ఘాంత పోయాడు రమాపతి.

ఎలాగో అయిదు నిమిషాల్లో తేరుకుని లేచి ఆఫీసుకి సెలవుపెట్టి బయటికి వచ్చి టాక్సీ ఎక్కి అశోకా లాడ్జికి పొమ్మని చెప్పి మళ్ళీ ఆ ఉత్తరం చదువసాగాడు.

మేస్టారూ !

నన్ను మీరు ఎంత నిందించినా నేను బాధపడను. నేను చేసిన తప్పు అలాంటిది.

అసలు నా వృత్తే అది !

ఏదో ఓ వ్యక్తిని ఎన్నుకోవటం అతన్ని గురించి విచారించి తెలుసుకోవటం - తర్వాత పరిచయం చేసుకోవటం — ఎలాగో మభ్యపెట్టి స్నేహితంతో నమ్మించి దగా చెయ్యటం ! ఇదీ నా వృత్తి.

ఈ వృత్తిలో ఎప్పుడూ పరాజయం పొందలేదు. కాదంటే యిన్వెస్ట్‌మెంట్ కాస్త ఎక్కువయ్యేది.

రకరకాల వ్యక్తులు ! రకరకాల ఆశలు !!

దేశంలో యీజీ మనీపై మనిషికి ఆశవున్నన్నాళ్ళు అతన్ని మోసం చెయ్యటం చాలా సులభం.

ఈ నా వృత్తిలో కనీసం నెలకి రెండువేలయినా సంపాదిస్తాను. అసలు నాకీ మార్గం బోధించిన పరమగురువులున్నారు. నేను యిలా ఒకసారి ఓ విషయంలో ఫెయిలయ్యాను. ఉద్యోగం కోసం పొట్ట పోసుకోవటంకోసం మద్రాసు వచ్చాను. సెంట్రల్‌లో దిగిన

నాకు ఓ మళయాళీ అనుభవపూర్వకంగా నేర్పిన పాఠం యిది. ఆ గంటన్నర పరిచయంలో చెప్పిన పాఠానికి గురుదక్షిణగా ఆయిదు వందలు తీసుకున్నాడు మా పరమగురువు శ్రీ రంగరాజన్.

అదే నాకు మార్గదర్శకమైంది నాటి నుంచీ !

పలు విధాలా పలువురని మోసగించాను.

సినిమా వ్యామోహంతో వచ్చేవారి నుండి ఎంతో లాగాను.

సినిమా నటులు గంధర్వులనీ - ఆ దేవతలని చూడాలనీ వాళ్ళతో మాటాడాలనీ - ఫోటో తీయించుకోవాలనీ ఆబగా ఆంధ్రదేశంనుంచి వచ్చే కాలేజీ కుర్రాళ్ళని సెంట్రల్ స్టేషన్ దాటి బాడ్జిలో దిగగానే దోచేవాడిని.

ఎన్నని చెప్పను ?

ఎన్నో విధాలుగా జీవనభృతికై పోరాడుతున్నాను. సంపాదించుకుంటున్నాను.

ఈ వృత్తిలో యింతవరకూ ఎదురు దెబ్బలు తగల్లేదు.

ఈ నా ధ్యేయంలో అరలక్ష చేరుకోగానే అంటే యింకా పదివేలు సమకూరగానే యీ రాష్ట్రం వదలి మన రాష్ట్రం వెళ్ళి జీవితంలో స్థిరపడతాను.

మీ డబ్బుల్లో రెండు వందలు నావి. మిగతా అనుకోకుండా వచ్చిన ఎరియర్స్ ! కాబట్టి దినదిన గండంగా వుండబోదు మీకు.

మీ మనసు గాయపడివుంటే నన్ను క్షమించండి.

ఇప్పటి పేరుతో

మీ

చందూ

వుత్తరం పూర్తిచేసేవేళకి టాక్సీ లాడ్జి ముందాగింది. అనుకున్నట్టుగానే ఖాళీచేసి వెళ్ళాడతను. రిసెప్షన్‌లో విచారిస్తే అతన్ని గురించి వాళ్ళకేం తెలియదన్నారు

చేసేదిలేక దొంగకి తేలుకుట్టిన విధంగా ఎవరితోనూ తన బాధ చెప్పుకోలేని స్థితికి బాధపడుతూ సిటీబస్ ఎక్కి యింటిముఖం పట్టాడు రమాపతి.

